క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆర్‌డీటీ వారు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. అప్పనపల్లె, పందిర్లపల్లె, గోనంపల్లె తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు పెద్ద కంబలూరు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. వారు రాకపోకలు సులభంగా సాగించేందుకు ఆర్‌డీటీ సంస్థ ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంస్థ రీజినల్ డైరెక్టర్ పుష్పలత, మేనేజింగ్ డైరెక్టర్ వేమయ్య పాఠశాలకు చేరుకొని ఎంఈఓ తిరుపతయ్య, హెచ్‌ఎం, పీఎంసీ చైర్మన్ సహదేవుడు, లాయర్ నరసింహులు చేతుల మీదుగా 84 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.

క్రీడల అభివృద్ధి అధికారిగా రాజు



కలెక్టర్‌ను కలిసి ఎంఎస్‌వీ రాజు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా ఎంఎస్‌వీ రాజు ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంతో శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి రాష్ట్ర యువజన సర్వీసుల శాఖను వేరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 1 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. శాప్ చీఫ్ కోచ్‌లు (డీఎస్‌డీఓలుగా) జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వ్యవహరించనున్నారు. 2018లో యువజన సర్వీసు శాఖను శాప్‌లో విలీనం చేశారు. మరికొన్ని రోజుల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం కానుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి తెలిపారు. పదోన్నతి పొందిన రాజును పలువురు సిబ్బంది అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చాగలమర్రి: స్థానిక కూలూరు రస్తాలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు అక్రమంగా మినీ లారీలో తరలిస్తున్న 51 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. చాగలమర్రికి చెందిన దస్తగిరి 51 క్వింటాళ్ల బియ్యాన్ని 111 ప్యాకెట్లలో నింపి మినీ లారీలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు తరలిస్తున్నాడనే సమాచారం మేరకు.. శుక్రవారం సిబ్బందితో కలిసి దాడి చేసి బియ్యంతో పాటు వాహనం, యజమానితో పాటు పట్టుబడ్డరన్నారు. వాహనం, బియ్యంతో పాటు నిందితుడిని చాగలమర్రి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఆ బియ్యాన్ని రుద్రవరంలోని ప్రభుత్వ గిడ్డంగికి తరలించినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

శుభకార్యం



వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే శిల్పా రవి, తదితరులు

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన ప్రముఖ జ్యువెలర్ అన్సర్ జ్యువెలర్స్ ఎండీ అమీర్‌బాషా కుమార్తె వివాహ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎల్‌కేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వేడుకల్లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మిట్నాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాల గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మండల శాఖల అభివృద్ధిపై ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్, విద్యా, పౌష్టికాహారం తదితర వాటిపై వీడియో డిస్‌ప్లే బోర్డు ద్వారా అవగాహన కల్పించారు. ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పల చిన్నతిరుపతి రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి అంకన్న పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సో ర్సింగ్ కార్మికులు సంస్థకు నిత్యం సేవలు అందిస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల న్నారు. బాలవెంకట్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాబు హామీలకు ష్యూరిటీ, గ్యారంటీలు ఉండవు

● ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

శిరివెళ్ల: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఇస్తున్న హామీలకు ష్యూరిటీ, గ్యారంటీ ఉండదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ, గుంప్రమాన్‌దిన్నెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గుంప్రమాన్‌దిన్నె బీసీ, ఓసీ కాలనీ, యర్రగుంట్లలోని కాపుపేట, దర్గా, ఎల్లమ్మపేటలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని వారి మద్దతును కోరారు. ఆయన మాట్లాడుతూ అధికారమే పరమావధిగా చంద్రబాబు మళ్లీ ప్రజలను మోసం చేయడానికి కొత్త పాట అందుకున్నారని విమర్శించారు. హామీలకు ష్యూరిటీ, గ్యారంటీల పేరుతో మళ్లీ ఓట్ల కోసం తిరుగుతున్నారని, గతంలో హామీలు ఇచ్చి నెరవేర్చిన తీరు ప్రజలకు అనుభవమేనని, అలాంటి ఇబ్బందులు పడే పరిస్థితుల్లో జనం లేరన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి వాటి అమలుతీరును ఇంటింటికీ తిరిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ చిత్తశుద్ధిని ప్రజలు అభినందిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సమయంలో బాబు ఇచ్చిన రైతు, మహిళా సంఘాల రుణ మాఫీ ఓ బూటకమని తేలిపోయిందన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో టీడీపీని చిత్తు చిత్తుగా ప్రజలు ఓడించారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేసి చూపించారన్నారు. అందుకే ప్రజలు జగనన్నంటేనే ఓనమ్మకం, ఓ విశ్వాసం అంటున్నారని చెప్పారు.

యర్రగుంట్లలో అభివృద్ధి పనులు..

నాలుగున్నర ఏళ్ల తమ ప్రభుత్వంలో యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మన బడి నాడు- నేడు కింద రూ.2.52 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాయన్నారు. రూ.29 లక్షలతో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. 152 మందికి ఇళ్ల పట్టాలు, 525 మందికి పక్కా గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. 152 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్లు, 444 మందికి కొత్తగా రైస్ కార్డులు పంపిణీ చేశామని, అలాగే 1,328 మంది డ్వాక్రా మహిళలకు రూ. 4.40 కోట్ల రుణమాఫీ కాగా ఇంత వరకు 3 విడతలుగా రూ.3.45 కోట్ల వారి ఖాతాలో జమయయ్యాయని వివరించారు. ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఏంపీపీ నాయక్ వసీం, సర్పంచులు తలారి జానకమ్మ, అయ్యలూరి సుభహాన్, నాయకులు ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్, చిన్న నాగిరెడ్డి, పెద్దలాల్, ఉశేనిరెడ్డి, జిల్లా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఇందూరి ప్రతాపరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి, కామినేనిపల్లె సర్పంచ్ నరసింహారెడ్డి, వెంకటాపురం సర్పంచు ప్రసాదరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



యర్రగుంట్లలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

మెడికల్ వ్యర్థాలను చెత్తలో కలపొద్దు

నంద్యాల(సిటీ): పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, హెల్త్ క్లినిక్‌లు, మెడికల్ షాపుల నుంచి వెలువడే వ్యర్థాలైన ఇంజెక్షన్లు, గాజుసీసాలు, సెలైన్ బాటిళ్లు, రేజర్లు, మానవ, జంతువుల శరీర భాగాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వారికి అందజేయాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. ఇప్పటికే పలు మార్లు హెచ్చరించినా పలు ప్రైవేటు ఆసుపత్రులు రోజు వారీ చెత్త సేకరణ కార్మికులకు వ్యర్థాలను అందిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం పట్టణంలోని పలు ఆసుపత్రులను శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణతో కలిసి తనిఖీ చేశారు.

11న మహానందిలో లక్ష బిల్వార్చన

మహానంది: ఈ నెల 11వ తేదీన కార్తీకమాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని క్షేత్రంలో లక్ష బిల్వార్చన, 12న అమవాస్య సందర్భంగా లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని శుక్రవారం తెలిపారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన, చండీ హోమం, దీక్షా హోమాలు ఉంటాయని చెప్పారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శిల్పా రవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం గ్రామానికి చెందిన హరిజన మత్స్యకార సంఘం కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు టీడీపీని వీడి పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్ధంశివరాం, వైఎస్సార్‌సీపీ గ్రామ ఇన్‌చార్జ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీకి వీర విధేయులైన మత్స్యకార సంఘానికి చెందిన కుటుంబాలు జగనన్న పాలన నచ్చి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో మారు అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఎంపీటీసీ దిబ్బన, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, చిన్న ఓబులేసు, లక్ష్మీనారాయణ, ఓబయ్య, రాజశేఖర్, పుష్పరాజ్, స్వామిదాసు, కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలోని పేదల అభివృద్ధి కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని 12వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, సాయంత్రం 21వ వార్డులో అనిల్ అమృతరాజ్‌తో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరిగి ప్రజలతో మాట్లాడి పథకాల అమలు, సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో జిల్లా కేంద్రం, మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గతంలో ఇంత లబ్ధి చేకూరిన పరిస్థితులు లేవని, ఇవన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్ను సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, పట్టణ అధ్యక్షుడు పున్న శేషయ్య, జాకీర్ హుసేన్, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, కౌన్సిలర్లు కృష్ణమోహన్, సాదిక్ బాషా, నాయకులు పార్థుడు, రహంతుల్లా, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, అంజి, షేషగిరి, అప్పన్న, భాస్కర్, మహేష్ దేవి, సుబ్బరాయుడు, రవి, శేషక్క పాల్గొన్నారు.



21వ వార్డులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీ1, డీ2 ఏఈలు నాగరాజు, రామయ్య శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, స్తంభాల పరిశీలనలో భాగంగా పట్టణంలోని సంతగేటు, జగజ్జనని గుడి ఏరియా, మూలమట్టం, ఫారుఖ్ నగర్, గుడిపాటిగడ్డ, నడిగడ్డ, శ్రీనివాసనగర్, బైటిపేట, సంగపేటలతో పాటు డీ2 పరిధిలోని ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, టెక్కె, నూనెపల్లె, నర్స్ క్వార్టర్స్, టీచర్స్ కాలనీ, నౌమాన్ నగర్, గిరినాథ్ సెంటర్, విశ్వనగర్, భరతమాత గుడి వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే గిరిజనుల రాష్ట్రస్థాయి సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించేందుకు జీపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ కేంద్రంగా సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

ఉయ్యాలవాడ : తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం మహమ్మద్‌షరీఫ్ సూచించారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. 6-18 సంవత్సరాల్లోపు పిల్లలందరిని బడిలో చేర్పించాలంటూ, విద్య ప్రాముఖ్యతపై నినాదాలు చేపట్టారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

దొర్నిపాడు: గ్రామాల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్‌ఓ సాంబశివుడు ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మండలస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలని కోరారు. పత్తిలో వచ్చే గులాబీరంగు పురుగు, జొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు.

అర్హత ఆధారంగానే పథకాల వర్తింపు



మాట్లాడుతున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు



37వ వార్డులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): అర్హత ఆధారంగానే సంక్షేమ పథకాలు అందుతున్నాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు అన్నారు. పట్టణంలోని 26వ వార్డు దేవనగర్, 37వ వార్డు నందమూరి నగర్ ప్రాంతాలలో శుక్రవారం వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. 26వ వార్డు దేవనగర్‌లో కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ..వార్డు పరిధిలో నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.24.37కోట్ల మేర ప్రభుత్వం వెచ్చించిందని చెప్పారు. ప్రతి గడప ముంగిటకే సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణి, వార్డు ఇన్‌చార్జ్ దేవనగర్ బాషా, జాకీర్ హుసేన్ పాల్గొన్నారు. అలాగే..37వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ యూసుఫ్, కన్వీనర్ అస్లాంబాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమాభివృద్ధిని వివరించే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. నందమూరి నగర్ ప్రాంత వాసులకు రూ.17.69 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. మెప్మా సీఎంఎం విజయభాస్కరరెడ్డి ఉన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట



ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న గంధం రాఘవరెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయడంతోనే రాష్ట్రంలో రైతన్న తెలెత్తుకుని బతుకుతున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ పాలకవర్గం గడువు ఆరు మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఆ శాఖ సెక్రటరీ, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా శుక్రవారం మార్కెట్ యార్డు సమావేశ భవనంలో చైర్మన్ గంధం రాఘవరెడ్డి అధ్యక్షతన పాలక మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అంతకు ముందు గడువు పొడిగించినందుకు.. పాలకవర్గం గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జీఓ 512ను రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నంద్యాల(వ్యవసాయం): భూ హక్కు చట్టం 2023కు సంబంధించిన యాక్టు 27, జీవో 512ను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు కోరారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు నుంచి టెక్కె మీదుగా కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోర్ల జయకృష్ణ, ప్రతాపరెడ్డి మాట్లాడుతూ 27 యాక్టును, జీవో 512ను వెంటనే రద్దు చేయాలని, భూ వివాదాలను పరిష్కరించే బాధ్యతను న్యాయ వ్యవస్థను కాదని, రెవెన్యూ అధికారులకు అప్పగించడం తగదన్నారు. వాటితో అధికారం ఉన్న వారిదే పెత్తనం సాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు రాజేశ్వరి, రఘుప్రకాష్, రాజేశ్వరరెడ్డి, కృష్ణలింగయ్య, రామచంద్రుడు, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ‘శివాంకిత అష్టావధానం’

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శ్రీశైల దేవస్థానం శుక్రవారం పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్వర్యంలో శివాంకిత అష్టావధానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా మేడసాని మోహన్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మేడసాని మోహన్ అష్టావధానం చేశారు. ఇందులో నిషిద్ధాక్షరికి మరుమూముల దత్తాత్రేయ శర్మ, న్యస్తాక్షరికి సంగంభట్ల నరసయ్య, దత్తపదికి కొండసాని ఆంజనేయరెడ్డి పృచ్ఛకులుగా వ్యవహరించారు. అలాగే సమస్యకు బి.ఓంప్రకాశ అవధాని, వర్ణనకు ఆర్.విశ్వేశ్వరరావు, పురాణ పఠనమునకు వై.వెంకటేశ్వర్లు భాగవతార్ పృచ్ఛకులుగా వ్యవహరించారు. శంకరనారాయణ - హాస్యవధాని అప్రస్తుత ప్రసంగాన్ని చేస్తుండగా, ఉన్నవ గణేశ్, అశువుకు పృచ్ఛకులుగా వ్యవహరించారు.



అష్టవధానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ మేడసాని మోహన్

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఉయ్యాలవాడ: మండలంలోని కుందూనది సమీపంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమ ఆవరణలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక విగ్రహ ప్రతిష్ఠోత్సవం శుక్రవారం వైభవంగా చేపట్టారు. మొదట గణపతి పూజ, పుణ్యాహవాచనం, వినాయక విగ్రహానికి ధాన్యాదివాసం, జలాభిషేకం, గణపతి హోమం, యంత్ర ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు మహానందరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు చేపట్టారు. అలాగే మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామికి కార్తీక మాసం బహుళ ఏకాదశి పురస్కరించుకుని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి.. ఆకుపూజ, పంచామృతాభిషేకాలు, సింధూర, కుంకుమార్చనలు చేశారు.



వినాయక విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం చివరి శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు చేపట్టి విశేషంగా అలంకరించి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహు కాల పూజలు, సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకరణలో అమ్మవారు

రేపు బ్రాహ్మణ దాత్రి సమారాధన

నంద్యాల(వ్యవసాయం): పట్టణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం దాత్రి సమారాధన మహోత్సవాన్ని స్థానిక ప్రథమనంది దేవాలయ ఆవరణలోని శ్రీగాయత్రీమాత ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కరణం మురళీకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి నగరడోన సుధీర్ శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, తులసి, ఉసిరిక చెట్లకు పూజలు చేపడతామన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం పార్వతీ దేవికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం స్పటిక లింగేశ్వరానికి పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం, క్షీరాభిషేకం చేపట్టి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం జరిపించారు. అనంతరం పార్వతీ దేవికి సామూహిక కుంకుమార్చన చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

లోక కల్యాణం కోసం రాజశ్యామల హోమం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో 44వ మండల విళక్కి మహోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు శుక్రవారం లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజల చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీగణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్ప, నవగ్రహ, రాజశ్యామల హోమాలు జరిపించి మహాపూర్ణాహుతి గావించారు. సాయంత్రం ఆయుధ పూజ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి మూలవిరాట్‌కు పుష్పయాగం చేసి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

వినియోగంలోకి వచ్చిన భవనం



నూతన భవనంలోకి గృహప్రవేశం చేస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని అధికారులు వినియోగంలోకి తీసుకొవచ్చారు. శుక్రవారం రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయడు పూజా కార్యక్రమాలు నిర్వహించి గృహ ప్రవేశం చేయించారు. అటవీ శాఖలో విధులు నిర్వహించే ఉద్యోగులు నివాసం ఉండేందుకుగతంలో భవనాలు నిర్మించారు. కాల క్రమేనా సరైన నిర్వహణ లేక అవి కూలిపోయాయి. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఒక్కో భవనానికి దాదాపు రూ.20 లక్షలు వెచ్చించి రెండు నూతన భవనాలను నిర్మించారు. అయితే అందులో సరైన వసతులు లేక పోవడంతో చేరేందుకు అధికారులు విముఖత చూపారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు అదనంగా కొన్ని నిధలు కేటాయించడంతో రెండు భవనాల్లో వసతులు కల్పించారు. అన్ని వసతులు సమకూరడంతో భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యకరమంలో ఫారెస్టర్ నాగరాజు,ఎఫ్‌బీఓలు,ఖాన్, నరసింహారెడ్డి,గౌడు ఉన్నారు.

కాటేసిన కరెంట్



మృతి చెందిన మంగళి చిన్న వెంకటేశ్వర్లు

శిరివెళ్ల: స్థానిక మంగళి పేటకు చెందిన చిన్న వెంకటేశ్వర్లు (46) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లు వరి పంటకు క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు పొలంలోని విద్యుత్ తీగ తెగి మీద పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

పనితీరు మెరుగు పరుచుకోండి

నంద్యాల(సిటీ): వార్డు సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలని అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి సూచించారు. శుక్రవారం పట్టణంలోని 48 సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. టీపీబీఓ రిజ్వానా, టీపీఎస్ శివుడు నాయక్ ఉన్నారు.